




# కరపత్రం

SINCE 2014

శుక్రవారం ఫిబ్రవరి 13, 2026 సంపుటి : 2 సంచిక : 128 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4




## ఉగాదికి సనత్‌నగర్ టిమ్స్

- » మార్చి రెండో వారానికల్లా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశం
- » సిద్ధమైన 16 ఆపరేషన్ థియేటర్లు
- » రెడీగా సీటీ స్కాన్, ఎంఆర్ఐ మిషన్లు
- » గుండె ఆపరేషన్ల కోసం క్యాథల్యాబ్
- » అవయవమార్పిడి కోసం ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్
- » ఏర్పాట్లపై మంత్రి దామోదర్ రాజనర్సింహ రివ్యూ

2లో..

హైదరాబాద్,ఫిబ్రవరి12 :
పేదలకు కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఉగాది పండుగ రోజున ఈ హాస్పిటల్‌ను ప్రారంభించి ప్రజలకు అంకితం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈలోగా సివిల్ పనులు, ఎక్విప్‌మెంట్ ట్రయల్స్ అన్నీ పూర్తి చేసి, హాస్పిటల్‌ను వైద్య సేవలు అందించేందుకు సిద్ధం చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీస్‌లో టిమ్స్ సనత్‌నగర్ పనుల పురోగతి, డాక్టర్లు, సిబ్బంది నియామకంపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓపీ రూమ్‌లు, డయాగ్నస్టిక్స్, ఇన్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్లు, వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూల ఏర్పాటుపై మంత్రి ఆరా తీశారు. 1000 బెడ్ల కెపాసిటీతో నిర్మించిన సనత్‌నగర్ టిమ్స్‌లో మౌలిక వసతుల కల్పన తుది దశకు చేరుకుందని అధికారులు



## మామునూరు ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభించండి

- » తెలంగాణ ఎయిర్‌పోర్టులకు అనుమతులు ఇవ్వండి
- » కేంద్రమంత్రి రామ్మోహన్‌కు సిఎం రేవంత్ వినతి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి12
వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు పనులు త్వరగా ప్రారంభించాలని సిఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. రాష్ట్రంలో నాలుగు కొత్త ఎయిర్‌పోర్టుల అభివృద్ధి కోసం అవసరమైన అనుమతులు, సహాయం కోరారు. భేటీలో మామూనూరు , కొత్తగూడెం, అంతర్గాం, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు సంబంధించిన పలు అంశాలు చర్చకు వచ్చాయి. మామూనూరు విమానాశ్రయానికి భూ సేకరణ పూర్తి కావడంతో, అవసరమైన నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి వినతి చేశారు. అలాగే, కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్ కోసం పాల్వంచలో స్థలం గుర్తించినందున, ఆబ్‌స్ట్రక్షన్ లిమిట్ సర్వే, ఫీజిబిలిటీ స్టడీలు త్వరగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అంతర్గాం ఎయిర్‌పోర్ట్ కోసం ప్రత్యామ్నాయ స్థలం గుర్తించినట్లు తెలిపిన సీఎం.. వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కేంద్రమంత్రిని కోరారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ విషయంలో అదనంగా 249.82 ఎకరాల భూమి కేంద్ర ప్రభుత్వానికి సిద్ధంగా ఉందని సీఎం తెలియజేశారు. ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని ఒక సంవత్సరంలో పూర్తి చేసి, ఎయిర్‌బస్ సర్వీసులు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సిఎం వెంట ఎంపిలు కడియం కావ్య, మల్లు రవి తదితరులు ఉన్నారు.



### ఎన్ని కార్పోరేషన్‌లు అయినా

## ఎగిరేది గులాబీ జెండాయే

### శేరిలింగంపల్లి నేతలతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

హైదరాబాద్,ఫిబ్రవరి12 :
హైదరాబాద్ కార్పొరేషన్‌ను ఎన్ని కార్పొరేషన్లు చేసినా ఎగిరేది మాత్రం ఖచ్చితంగా గులాబీ జెండానేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు విజయ్ కుమార్ రెడ్డి తన అనుచరులతో కలిసి గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలోకేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఎమ్మెల్యేలు పోయినా.. పార్టీ వెన్నెముక కార్యకర్తలేనన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పార్టీని వీడినా, కార్యకర్తలు మాత్రం చెక్కుచెదరకుండా కేసీఆర్ నాయకత్వంలోనే ఉన్నారని ప్రశంసించారు. మొత్తం హైదరాబాద్‌లోనే శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీకి నంబర్ వన్ కోటగా నిలిచింది. స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు వెళ్లినా, బంగారం వంటి కొత్త నాయకులు వందల సంఖ్యలో పార్టీలో చేరుతున్నారు.శేరిలింగంపల్లిలోని 24 డివిజన్లలో క్లీన్ స్వీప్ చేసే సత్తా మనకుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అరిచేతుల వైకుంఠం చూపి అధికారం దక్కించుకుందని కేటీఆర్ విమర్శించారు. మరోవైపు బీజేపీ 12 ఏళ్లుగా తెలంగాణకు 12 పైసల పని కూడా చేయలేదని, అది 'పూజకు పనికిరాని పువ్వు' అని ఎద్దేవా చేశారు. 'వెట్టి పనికైనా, మట్టి పనికైనా మనోడే ఉండాలి' అన్న నానుడిని గుర్తు చేస్తూ, తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని కేటీఆర్ పేర్కొన్నారు.నగరంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ ప్రతిష్ట దెబ్బతింటోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

మిగతాది 2లో



### స్వర్ణగిరికి బ్రహ్మోత్సవాల సిరి

## అంగరంగ వైభవంగా ప్రారంభం

అపార కారుణ్యమూర్తి, భక్తవత్సలుడు, సర్వగుణ సంపన్నుడు, భూలోక వైకుంఠ క్షేత్ర నాథుడు అయిన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామికి జరిగే నిత్యోత్సవ, వారోత్సవ, పక్షోత్సవ, మ్సావ, సంవత్సరోత్సవ సేవలలో అత్యంత ప్రధానమైనది బ్రహ్మోత్సవం.వైఖానస ఆగమోక్తంగా వైదిక ఉపచారాల ప్రకారం ధ్వజస్తంభంపై గరుడ ధ్వజపటాన్ని ఎగురవేయటం (ధ్వజారోహణం), బలి ఆచారాలు, మహారథోత్సవం, శ్రవణా నక్షత్రంలో చక్రస్నానం, ధ్వజావరోహణం వంటివి ఈ ఉత్సవాల్లోనే నిర్వహిస్తారు.

2లో



## పోలీసులపై దురుసు ప్రవర్తన


» కాంగ్రెస్ నేత జగ్గారెడ్డిపై కేసు నమోదు

సంగారెడ్డి,ఫిబ్రవరి12 :
టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ నేత జగ్గారెడ్డిపై సంగారెడ్డి పోలీసులు కేసు నమోదు చేశారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల విధులకు ఆటంకం కలిగించారంటూ ఆయనపై కేసు నమోదు చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ చర్య తీసుకున్నారు.

### పంచాయితీలకు మరో

## రూ.387 కోట్లు విడుదల

– ఫలించిన మంత్రి సీతక్క వినతి



హైదరాబాద్,ఫిబ్రవరి12 :
గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం కింద రూ.387 కోట్లని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. మొదటి విడతగా ఇప్పటికే రూ. 259.36 కోట్లు విడుదలైన విషయం తెలిసిందే. తాజా విడతతో కలిపి మొత్తం నిధులు రూ. 646.36 కోట్లు విడుదలయ్యాయి. తెలంగాణకు 15వ ఆర్థిక సంఘం కింద సుమారు రూ. 3,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తి చేసి, కేంద్రం కోరిన సమాచారాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ సమర్పించింది. ఇందుకు అనుగుణంగా విడతలవారీగా కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇంకా సుమారు రూ. 2,400 కోట్లు విడుదల కావాల్సి ఉంది. గ్రామాల అభివృద్ధి కోసం పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని కేంద్రానికి తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రంలో 44వేలకు పైగా జర్నలిస్టు అక్రిడిటేషన్ కార్డులు

- » పారదర్శకంగా అర్హులందరికీ న్యాయం
- » సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి



2లో..

హైదరాబాద్,ఫిబ్రవరి12 :
రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై గురువారం



## తెలంగాణ జాగృతి పార్టీ పెట్టడం పక్కా

- ఉద్యమకారులకు అన్యాయం జరిగింది
- ఊహించిన దానికి భిన్నంగా నిర్ణయాలు
- అందుకే మళ్లీ పోరాటం చేయాల్సి వస్తోంది
- కోదండరామ్ లాంటి వారు ఆలోచన చేయాలి
- తన పక్కన పైరవీకారులు లేరన్న కవిత

02

## భూ కేటాయింపులపై శాసన మండలిలో వాడీవేడి చర్చ

### పెట్టుబడుల రాకుండా వైకాపా కుట్రలు

- » రియల్ ఎస్టేట్ సంస్థలకు భూ కేటాయింపులు అబద్ధం
- » క్రెడిబులిటీ ఉన్న ఐదు సంస్థలకే 99 పైసల చొప్పున కేటాయింపు
- » విపక్ష సభ్యుల ఆరోపణలు తిప్పికొట్టిన మంత్రి లోకేశ్



అమరావతి,ఫిబ్రవరి12 :
రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదని వైకాపా కుట్రలు చేసిందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. పరిశ్రమలకు భూ కేటాయింపులపై శాసన మండలిలో వాడీవేడి చర్చ జరిగింది. కంపెనీల పేరిట రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పనంగా భూములను కట్టబెట్టారంటూ వైకాపా సభ్యులు చేసిన ఆరోపణలను మంత్రి లోకేశ్ తిప్పికొట్టారు. క్రెడిబులిటీ ఉన్న ఐదు సంస్థలకే 99 పైసల చొప్పున భూములు కేటాయించామని.. ఆధారాలు లేకుండా విమర్శలు చేస్తే సహించబోమని లోకేశ్ చెప్పారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్లే 18 నెలల్లో భారీగా పెట్టుబడులు వచ్చాయన్నారు. ఆర్సెలార్ మిత్తల్ ప్రాజెక్ట్ ఉత్తరాంధ్రకు రానుందని.. దీనికి భూములు కేటాయించామని మంత్రి లోకేశ్ అన్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలకు భూములు ఇవ్వడం తప్పా? అని నిలదీశారు. వైకాపా పాలనలో విశాఖకు కనీసం ఒక్క కంపెనీ అయినా తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. మండలిలో భూ కేటాయింపులపై వాడివేడి చర్చ నడుస్తోంది. కంపెనీలకు 99 పైసలకు ఎకరం భూములిచ్చారనే అంశంపై వాగ్వాదం నడిచింది. భూములిచ్చినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని గతంలోనే ఛాలెంజ్ చేశానని, వాళ్లు ఆధారాలు తీసుకురాలేకపోయారని మంత్రి లోకేష్ అన్నారు. క్రెడిబులిటీ ఉన్న కంపెనీలకే భూములు ఇస్తున్నాం అని లోకేష్ స్పష్టం చేశారు.

మిగతాద్ది 2 లో

## కార్మికుల కష్టంతోనే ఈ దేశం నడుస్తోంది: మహేశ్‌కుమార్ గౌడ్



హైదరాబాద్:
కార్మికుల హక్కులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఆ హక్కు మోదీకి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు.

మిగతాది 2లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం ఫిబ్రవరి 13, 2026

# స్వర్ణగిరికి బ్రహ్మోత్సవాల సిరి అంగరంగ వైభవంగా ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

లోక కల్యాణార్థం సకల శుభ్రప్రాప్తి కోసం అస్మద్ ఆచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి మంగళాశాసనాలతో అంగరంగ వైభవంగా... అత్యంత భక్తి శ్రద్ధలతో కన్నుల పండువగా జరిగే ఈ బ్రహ్మోత్సవాల వివరాలు..

**విశేష కార్యక్రమాలు అంకురార్పణతో ఆరంభం**

స్వర్ణగిరీశుని ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నాడు అంకురార్పణ కార్యక్రమంతో ప్రారంభ మయ్యాయి. 17వ తేది వరకు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో ఉన్న ఈ దివ్యక్షేత్రంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళాశాసనాలతో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థానం కార్యనిర్వాహకులు మానేపల్లి రామారావు తెలిపారు.

**విశేష కార్యక్రమం వివరాలు**

**నేటినుంచి పల్లకిసేవ...**

12 వ తేది: సింహవాహన సేవ, పరమేష్టివాహనం, నిశాచూర్ణోత్సవం, సాయంత్రం: ఎదుర్కోళ్ల ఉత్సవం, స్వామి వారికి గజవాహన సేవ, అమ్మవారికి హంసవాహన సేవ(లోక కల్యాణం కోసం)

13 వ తేది: పల్లకీ సేవ, సుదర్శన ఇష్టిహవనం, సాయంత్రం స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం, గరుడవాహన సేవ, అశ్వవాహనసేవ,

14 వ తేది: పల్లకీసేవ, సకల కార్యసిద్ధి కొరకు విష్వక్సేన ఇష్టి, సాయంత్రం హనుమంతవాహన సేవ.

15 వ తేది: పల్లకి సేవ, సకల విద్యాప్రాప్తి కొరకు హయగ్రీవ ఇష్టి.సాయంత్రం అశ్వవాహన సేవ.

16 వ తేది: పల్లకి సేవ, ధన్వంతరి ఇష్టి, సాయంత్రం స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి రథోత్సవం.

17 వ తేది: సర్వభూపాల వాహన సేవ, అష్టోత్తర శత కలశాభిషేకం, చక్రస్నానం. సాయంత్రం పల్లకి సేవ, పుష్పయాగం, ద్వాదశారాధన, దేవతోద్వాసన, బలిహరణ మహాపూర్ణాహుతి, ధ్వజారోహణం, సప్తవరణ, మహా కుంభ సంప్రోక్షణ, శాత్తు మొఖై, వేద విన్నపములు, రుత్విక్వరణం, వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాద గోష్టితో పూర్తికానున్నాయి.

**ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు**

సుప్రభాత సేవ, ప్రాతఃకాల ఆరాధన, సేవాకాలం, నివేదన, తీర్థప్రసాద గోష్ఠి, యాగశాలలో ద్వార తోరణం, ధ్వజ కుంభారాధన, చతుస్థానార్చనలు, వేదవిన్నపం, విశేష హోమాలు, పంచసూక్త పరివార,ప్రాయశ్చిత్త హోమాలు, నివేదనలు, నిత్యపూర్ణాహుతి, బలిహరణ, శాత్తుమొలై, ప్రసాద గోష్ఠి

**సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు**

శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, యాగశాలలో ద్వారతోరణం, ధ్వజకుంభారాధన, చతుస్థానార్చన, విశేష హోమాలు, పంచసూక్త పరివార ప్రాయశ్చిత్త హోమాలు, నివేదన, నిత్యపూర్ణాహుతి, బలిహరణ, శాత్తుమొలై, ప్రసాద గోష్ఠి

# భూ కేటాయింపులపై శాసన మండలిలో వాడీవేడి చర్చ

మొదటిపేజీ తరువాయి

రియల్ ఎస్టేట్ సంస్థలకు భూములు ఎలా ఇస్తారు? అని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. రహేజా రియల్ ఎస్టేట్ వ్యవస్థ కాదని మంత్రి అచ్చెన్నాయుడు బదులిచ్చారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ? 'విశాఖను ఐటీ క్యాపిటల్‌గా చేయాలని ప్లాన్ ప్రకారం ముందుకు వెళుతున్నాం. ఇరవై లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఉద్యోగాల కల్పన మా ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వానికి ఆదాయం తగ్గినా ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం. ఐటీ రంగంలో ఐదు కంపెనీలలో ఐదు లక్షల ఉద్యోగాల కల్పన మా లక్ష్యం. దేశంలో నే 23.5శాతం పెట్టుబడులు ఏపీకి వస్తున్నాయి' అని అన్నారు. శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. 'వైజాగ్‌లో 2006లోనే ఐటీ ఎకో సిస్టమ్ ఏర్పాటు చేశాం. 2019 వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక అదానీ డేటా సెంటర్ వచ్చింది. వైజాగ్‌లో చంద్రబాబు కుటుంబ సభ్యులకు ఐదు వేల కోట్ల భూములు ఇస్తున్నారు. గీతంకి భూములు కేటాయింపుపై వాక్ ఔట్ చేస్తున్నాం' అని అన్నారు. భూ కేటాయింపుల ప్రశ్నకు ప్రభుత్వ సమాధానానికి నిరసనగా ఆ ప్రశ్న నుంచి వైసీపీ ఎమ్మెల్సీలు వాకౌట్ చేశారు. శాసనమండలిలో 99 పైసలుకు పరిశ్రమలకు భూములు కేటాయింపుపై వైసీపీ ఎమ్మెల్సీ మాధవరావు ప్రభుత్వానికి ప్రశ్న వేయగా.. ఐదు కంపెనీలకు 99 పైసలకు భూములు కేటాయించినట్లు మంత్రి లోకేష్ తెలిపారు. 'గత 20 నెలల్లో ఏయే కంపెనీలకు 99 పైసలకే భూములు ఇచ్చారు. ఎవరికి ఎన్ని ఎకరాలు ఎంత ధరకు ఇచ్చారో చెప్పలేదు. గతేడాది ప్రారంభమైన కంపెనీలకు కూడా 99 పైసలుకే భూములిచ్చారు. విజయవాడలో రూ.156 కోట్ల పెట్టుబడులకు రూ.600 కోట్ల విలువైన భూములిచ్చారు. అమరావతికి టెండర్లు పిలిచారు. లూలు సంస్థకు ఎందుకు టెండర్లు పిలవలేదు. రూ.3 వేల కోట్ల విలులైన భూమిని రియల్ ఎస్టేట్ సంస్థకు 99 పైసలుకే లీజుకు ఇచ్చారు. రియల్ ఎస్టేట్ సంస్థలు స్థలాలు కొనుక్కోలేవా. 5 వేల కోట్ల విలువైన భూములను విశాఖలోని ఓ విద్యాసంస్థ తమ ఆధీనంలో ఉంచుకుంది. ఆ సంస్థ కేవలం తాము వెయ్యి కోట్ల విలువైన భూమినే ఆక్రమించామని చెప్తోంది. వెయ్యి కోట్ల విలువైతే భూములను ఆక్రమించొచ్చా?' అని ఎమ్మెల్సీ మాధవరావు అడిగారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ? 'ఎంవోయూలన్నీ క్లారిటీగా ఉన్నాయి. 99 పైసలుకి 5 కంపెనీలకు మాత్రమే భూములు కేటాయించాం. కాగ్నిజెంట్, టాటా కన్‌స్టలెన్సీ సర్వీసెస్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, రహేజా, మదర్స్ అండ్ ఇంటర్నేషనల్ కు 99 పైసలుకే భూములిచ్చాం. హైదరాబాద్లో రహేజా మైండ్ స్పేస్లో లక్ష మంది ఐటీ రంగంలో పనిచేస్తున్నారు. రహేజా గ్లోబల్ బిల్డ్ కాపబులిటీ సెంటర్లు నిర్మిస్తుంది. మేం భూమిలిచ్చిన ప్రతీ కంపెనీ క్రెడిబులిటీ ఉన్నవే. రహేజా వాళ్ళు లక్ష ఎకరాల్లో నిర్మాణాలు చేసి సాఫ్ట్వేర్ కంపెనీలకు అ÷-దదెకు ఇస్తారు. మేము పారదర్శకంగానే వాళ్లకు భూములు ఇస్తున్నాం. దానివల్ల వాళ్లు చేసిన నిర్మాణాల్లో పెద్ద ఎంఎన్సీ కంపెనీలకు ఇచ్చాం తప్ప అయానా.. గయానా కంపెనీలకు ఇవ్వలేదు' అని బదులిచ్చారు.

# ఉగాదికి సనత్‌నగర్ టిమ్స్

మొదటిపేజీ తరువాయి

మంత్రికి వివరించారు. హాస్పిటల్ అత్యంత కీలకమైన 16 ఆపరేషన్ థియేటర్లు శస్త్రచికిత్సలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. రోగ నిర్ధారణ కోసం అత్యాధునిక సీటీ స్కాన్, ఎంఆర్ఐ , డిజిటల్ ఎక్స్-రే మిషన్ల ఇన్‌స్టాలేషన్ పక్రియ పూర్తయ్యిందన్నారు. డయాగ్నస్టిక్స్ యంత్రాలు ఇన్‌స్టాలేషన్ జరుగుతోందన్నారు. మార్చి రెండో వారం నాటికి అన్ని పనులు, ఎక్విప్‌మెంట్ ఇన్‌స్టాలేషన్ పక్రియ పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. హాస్పిటల్ ప్రారంభమయ్యే నాటికి టెక్నీషియన్లకు, సిబ్బందికి ట్రైనింగ్ కూడా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. సనత్‌నగర్ టిమ్స్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ కార్డియాక్ కేర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఆర్గాన్ ట్రాన్స్‌ఎ÷-లాంటేషన్‌గా తీర్చిదిద్దాలని గతంలోనే అధికారులకు మంత్రి సూచించారు. ఇందుకు అనుగుణంగా అన్నిరకాల గుండె సంబంధిత ఆపరేషన్లు చేసేలా, అవయవమార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించేలా క్యాథల్యాబ్స్, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ థియేటర్ల ఏర్పాటుపై మంత్రి ఆరా తీశారు. క్యాథల్యాబ్ ఏర్పాటు పనులు చివరి దశలో ఉన్నాయని, ఓటీలు ట్రయల్ రన్‌కు సిద్ధంగా ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. నగరంలోని నిమ్స్, ఉస్మానియా, గాంధీ హాస్పిటల్‌పై పెరుగుతున్న రోగుల ఒత్తిడిని తగ్గించేందుకు టిమ్స్ సనత్‌నగర్ ప్రధాన భూమిక పోషిస్తుందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఆయా హాస్పిటళ్లలో శస్త్రచికిత్సల కోసం నెలల తరబడి వేచి చూస్తున్న రోగులను ఇక్కడికి రిఫర్ చేసి, త్వరితగతిన వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. దీనికి సంబంధించి ఆయా హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు సమన్వయం చేసుకోవాలని మంత్రి సూచించారు. హాస్పిటల్ నిర్వహణకు అవసరమైన ప్రొఫెసర్లు, డాక్టర్లు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది నియామక పక్రియపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆరా తీశారు. పూర్తిగా కొత్త హాస్పిటల్ అయినందున.. డీఎంఈ, నిమ్స్ పరిధిలోని సీనియర్ డాక్టర్ల సేవలను సనత్‌నగర్ టిమ్స్‌లో వినియోగించుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. అలాగే, పారిశుధ్యం, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సేవలను అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ విషయంలో ఇప్పటికే నగరంలోని పలు కార్పొరేట్ హాస్పిటల్స్, నిమ్స్, ఎయిమ్స్‌లో అనుసరిస్తున్న పద్ధతులను డీఎంఈ నేతృత్వంలోని కమిటీ అధ్యయనం చేసి, నివేదిక అందజేసింది. ఆయా హాస్పిటల్స్‌లో అవలంభిస్తున్న బెస్ట్ ప్రాక్టీస్ విధానాలనే టిమ్స్‌లోనూ అమల్లోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. మెడికల్ సర్వీసెస్‌తో పాటు సానిటేషన్, సెక్యూరిటీ వంటి నాన్ మెడికల్ సర్వీసెస్ విభాగాలు కూడా పటిష్టంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. రోగులకు ఓపీ రిజిస్ట్రేషన్ నుంచి డిశ్చార్జి వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ-హెచ్ఎంఐఎస్ (।-ఊఓఎ÷ూ) సాఫ్ట్‌వేర్ ద్వారా సేవలను అనుసంధానించాలని మంత్రి సూచించారు. రోగులకు, వారి సహాయకులకు నాణ్యమైన భోజనం అందించేందుకు సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. మార్చి 15 నాటికి పెండింగ్‌లో ఉన్న చిన్న చిన్న పనులన్నీ పూర్తి చేసి, ఉగాది నాటికి హాస్పిటల్‌ను ప్రారంభానికి సిద్ధం చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

# తెలంగాణ జాగృతి పార్టీ పెట్టడం పక్కా

మొదటిపేజీ తరువాయి

తాను కచ్చితంగా రాజకీయ పార్టీని స్థాపిస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ పేరుతోనే పార్టీ ఉంటుందని పేర్కొన్నారు. జాగృతి రాజకీయ శక్తిగా మారుతుందని తెలిపారు. స్వీయ అస్థిత్వం, ఉద్యమ ఆకాంక్షలు, తెలంగాణ వాదాన్ని నిలబెట్టుకోవడం కోసమే రాజకీయ పార్టీని స్థాపిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ పార్టీ ఫక్తు రాజకీయ పార్టీగా ఉండదని కుండబద్దలు కొట్టారు. రాజకీయ పార్టీ స్థాపిస్తానంటే.. తనపై దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన పక్కన పైరవీకారులు లేరని.. ఎప్పుడూ ఉద్యమకారులే ఉన్నారని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు కవిత. గురువారం నాడు బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణమండపంలో జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ జరిగింది. ఈ సభలో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. ఉద్యమకారులను పట్టించుకోలేదు కాబట్టే ఆ పెద్ద మనిషి అధికారం కోల్పోయారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ని పరోక్షంగా విమర్శించారు. గత పాలకులు అహంకారం ఎక్కువై ఓడిపోయారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై విమర్శలు సంధించారు. కేసీఆర్ హయాంలో అసెంబ్లీ ముందు ఉద్యమకారుడు ఆత్మాహుతి చేసుకుని చనిపోయాడన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని సైతం ఉద్యమకారులు బంగ్లా నుంచి బయటకు గుంజుతారని జోస్యం చెప్పారు. తెలంగాణ వచ్చిన తర్వాత 63 సీట్లతో అధికారం ఇస్తే.. అన్ని పార్టీలను విలీనం చేసుకున్నారంటూ కాంగ్రెస్ పార్టీపై ఆమె నిప్పులు చెరిగారు. ఇక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హయాంలో ప్రజాస్వామ్య విలువలు కాల రాయబడ్డాయన్నారు. ఇందిరా పార్క్ వద్ద ధర్నా చౌక్ ఎత్తేశారని.. సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తే అరెస్టులు చేశారంటూ కవిత ఆందోళన వ్యక్తం చేశారు. అప్పట్లో ఎవర్ని గెలిపించినా.. బీఆర్ఎస్ పార్టీలోకే వెళ్తారన్న పరిస్థితి వచ్చిందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత.. చిన్న వారికి లాభం జరగలేదని తెలిపారు. కానీ మెగా కృష్ణారెడ్డి మాత్రమే కుబేరుడు అయ్యాడంటూ వ్యంగ్యంగా అన్నారు. అలాగే ఉద్యమకారులకు న్యాయం చేసే బాధ్యత తీసుకోవాలంటూ ప్రొఫెసర్ కోదండరాంకు ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత సూచించారు. ప్రొ.కోదండరాం, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తదితరుల లాంటి వారి వల్లే సీఎం రేవంత్ రెడ్డిని ఉద్యమకారులు నమ్మారన్నారు. అయితే రెండేళ్లుగా ఎందుకు మాట్లాడటం లేదంటూ ప్రొ.కోదండరాంను ఈ సందర్భంగా

కవిత సూటిగా ప్రశ్నించారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ సంక్షేమ బోర్డు ప్రకటన చేయాలంటూ రేవంత్ ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఉద్యోగాల్లో 25 శాతం కోటాను ఉద్యమకారుల పిల్లలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.మలిదశ తెలంగాణ ఉద్యమం మొదలైన ఆరేండ్ల తర్వాత కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితి పెట్టారని మాజీ ఎమ్మెల్సీ కవిత అన్నారు. 1995లో వరంగల్ డిక్లరేషన్ తో మలిదశ తెలంగాణ ఉద్యమం మొదలైందని ఆమె చెప్పారు. స్వరాష్ట్ర ఉద్యమంలో మారోజు వీరన్న, గద్దర్ లాంటి వారు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ తెలంగాణ గడ్డపై విరామం లేకుండా ఒకదాని తర్వాత మరొక ఉద్యమం కొనసాగుతూనే వచ్చిందన్నారు. 2001లో కేసీఆర్ టీఆర్ఎస్ పెట్టారని, నిప్పుకణికలా మండుతున్న ఉద్యమాన్ని అగ్గిరాజేసిండని అన్నారు. 2014లో తెలంగాణ తెచ్చుకున్నంక ఉద్యమకారులకు దక్కుతదని అనుకున్నమో వారికి న్యాయం జరగలేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉద్యమకారులకు సరైన న్యాయం జరగలేదని ఎక్కడైనా ఉద్యమకారులకు పదవులు దక్కితే వారు మిగతా వారిని పురుగులను చూసినట్లు చూశారని విమర్శించారు. 'తెలగాణ ఉద్యమ సమయంలో మనను కొట్టించారో వారు సార్ పక్కనే చేరిండ్రు.. కేశవరావు జాదవ్ చనిపోతే ఆయనకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయా..? జయశంకర్ బొమ్మ కేబీఆర్ పార్కు వద్ద పెట్టాలని నాటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ ను పదే పదే అడిగిన.. సుప్రీంకోర్టు తీర్పు అడ్డొచ్చింది.. ట్యాంకు బండ్ మీద పెడతామన్న పెట్టుకోలేక పోయినం.. అక్కడున్న ఆంధ్రోళ్ల విగ్రహాలు తీస్తరని అనుకున్నం... తీయకపోతివి.. కనీసం మనోళ్ల విగ్రహాలైన పేట్టకపోతివి.. ఆ బాధ వెంటాడుతూనే ఉన్నది. ఇప్పుడొచ్చినైన ఎవరి బొమ్మలు పెడుతుండో అర్థం కాని పరిస్థితి ఉంది. ఉద్యమానికి వ్యతిరేకంగా గన్ను పట్టుకొని తిరిగిన రేవంత్ రెడ్డిని గెలిపించుకున్నం.. ఆయనకు ఏం సోయి ఉంటది తెలంగాణ అంటే. రవీంద్ర భారతిలో గద్దర్, బిరదరాజు రామరాజు, సుద్దాల విగ్రహాలు ఉండాల్సింది... ఎవరి విగ్రహాలున్నాయి. చేతులో ఉన్నప్పుడు చేసుకోలేదు. ఇప్పుడు మన చేతులో పోరాటం తప్ప ఏమీ లేదు. ఇప్పుడు పోరాడితేనే ఉద్యమ కారులకు న్యాయం జరుగుతుంది.' అని కవిత అన్నారు. తెలంగాణలోని ప్రైవేట్ సంస్థల్లో స్థానికులకు 20 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్జడెట్ సమావేశాల్లో ఇందుకు సంబంధించిన బిల్లును పాస్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఇందుకోసం తెలంగాణ జాగృతి పోరాడుతుందని చెప్పారు. వందల, వేల సంఖ్యలో ఉద్యమకారులు ఈ రాష్ట్రంలో ఉన్నారని, ఇందుకోసం యాప్ లాంచ్ చేశామని అందులో వివరాలు నమోదు చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు రాబోయే బ్జడెట్లో నిర్ణయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. చేయకుంటే ఊరుకునేది లేదని సీఎం రేవంత్ రెడ్డిని కాదు ప్రొఫెసర్ కోదండరామ్ ను హెచ్చరిస్తున్నానన్నారు.

## ఎన్ని కార్పోరేషన్‌లు అయినా
# ఎగిరేది గులాబీ జెండాయే

మొదటిపేజీ తరువాయి

పట్టపగలే సుల్తాన్ బజార్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో దోపిడీలు, చందానగర్‌లో జ్యువెలరీ షాపులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో వ్యాపారాలు, వాణిజ్య సంస్థలు కుదేలయ్యాయని, కొత్త కొలువులు రాకపోగా ఉన్నవి పోయే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. త్వరలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల కోసం డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీని మరింత పటిష్టం చేస్తామన్నారు కేటీఆర్. ఎమ్మెల్యే లేడని భయపడకండి, మీకు అండగా నేను, తలసాని శ్రీనివాస్ యాదవ్, అరికెపూడి, కృష్ణారావు ఉంటాం. ఏ అవసరమొచ్చినా మేము అందుబాటులో ఉంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. తప్పుడు ఓటు వేస్తే ఐదేళ్ల పాటు శిక్ష అనుభవించాల్సి వస్తుందని, ఓటు వేసే ముందు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని.. ముఖ్యంగా మహిళా లోకానికి కేటీఆర్ విన్నవించారు. చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావడం శుభపరిణామమని, విజయ్ కుమార్ రెడ్డి వంటి యువకులు పార్టీకి ఆస్తి అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీష్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు , నేతలు పాల్గొన్నారు.

## పోలీసులపై దురుసు ప్రవర్తన
# కాంగ్రెస్ నేత జగ్గారెడ్డిపై కేసు నమోదు

మొదటిపేజీ తరువాయి

జగ్గారెడ్డిపై సంగారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో బీఎన్ఎస్ 223, 351, 352, 132, 329 సెక్షన్ల కింద కేసు నమోదు అయ్యింది. బుధవారం సంగారెడ్డి పోలింగ్ బూత్ వద్ద జరిగిన సంఘటనపై ప్రెస్‌నోట్‌లో వివరణ ఇచ్చారు జగ్గారెడ్డి. నిన్న సంగారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో పోలింగ్ బూత్ వద్ద కాంగ్రెస్ నాయకుడిని సీఐ గల్లా పట్టుకొని ఈడ్చుకొచ్చి కొట్టారని తెలిపారు. తన పార్టీ నాయకుడిని రక్షించుకోవడానికి బూత్‌కు వెళ్లి సీఐని తిట్టాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థికి మద్దతుగా సీఐ... తమ పార్టీ నాయకుడిని అవమానించారని తెలిపారు. కావాలని లా అండ్ ఆర్డర్ దెబ్బతినేట్లు చేసిన సీఐని తిట్టడం జరిగిందని జగ్గారెడ్డి వివరించారు. ఈ విషయంపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చని.. కానీ పది మంది మధ్యలో తమ పార్టీ నాయకుడికి సీఐ చేసిన అవమానం పోగొట్టడానికి బూత్ దగ్గరకు వెళ్లాల్సి వచ్చిందని జగ్గారెడ్డి తెలిపారు. ఎన్నికల నిబంధనలను సీఐ లేదా తాను ఉల్లంఘించినా.. అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. అందరూ దానిని స్వాగతించాలని అన్నారు. న్యాయస్థానంలో ఎవరి తప్పు, ఎవరి ఒప్పు తేలుతుందని పేర్కొన్నారు. ఈ సంఘటనను నిన్న సాయంత్రం 5 గంటలకే వదిలేశానని చెప్పారు. సంగారెడ్డిలో జరిగిన సంఘటనను కేటీఆర్, హరీశ్ రావు, బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో తిప్పారని మండిపడ్డారు. అధికారులపై జగ్గారెడ్డి దాడి చేస్తున్నారంటూ పదేపదే ప్రచారం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ఆరోపించారు. 'గతంలో కేటీఆర్ ఒక పోలీసు అధికారిని బూతు పదజాలంతో తిట్టారు. తెలంగాణ పోలీసులను తన్ని, తిట్టి, 'ఆంధ్రోళ్లకు పుట్టారా' అంటూ హరీశ్ రావు నీచంగా మాట్లాడారు' అని గుర్తు చేశారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా ముందుగా కేటీఆర్, హరీశ్ రావు తిట్టిన విషయాలకు సమాధానం చెప్పి, ఆ తర్వాత తన గురించి మాట్లాడితే బాగుంటుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హితవుపలికారు

# రాష్ట్రంలో 44వేలకు పైగా జర్నలిస్టు అక్రిడిటేషన్ కార్డులు

మొదటిపేజీ తరువాయి

సచివాలయంలోని తన కార్యాలయంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్‌వో జి. మల్సూర్‌లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. పక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జి.ఓ. 252 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను సవివరంగా పరిగణనలోకి తీసుకొని అవసరమైన సవరణలు చేసి జి.ఓ. 103ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సవరణల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మరియు డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రిడిటేషన్ కార్డులు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని మంత్రి వివరించారు. 2.50 లక్షల పైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుండి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న24 పత్రికలకు 17,784 కార్డులు , 25001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390, అదేవిధంగా 15001 నుంచి 25000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661 , 15వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226, పీరియాడికల్స్‌కు 624, 20 న్యూస్ ఏజన్సీలకు 68 అక్రిడిటేషన్‌లు పొందుతాయని తెలిపారు. అలాగే 21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ ఛానల్స్‌కు 32, వంద లోకల్ కేబుల్ ఛానళ్లకు 200 ,డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు మొత్తంగా 44,706 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో 16,056, నియోజకవర్గ మరియు మండల స్థాయిలో 28,650 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ నిరంతర పక్రియ అని, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# కార్మికుల కష్టంతోనే ఈ దేశం నడుస్తోంది: మహేశ్‌కుమార్ గౌడ్

మొదటిపేజీ తరువాయి

కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో, ఆర్టీసీ యూనియన్లు, వివిధ వర్గాల కార్మికులు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూడెమెక్రసీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఒక రోజు బంద్‌లో మహేశ్ గౌడ్ పాల్గొన్నారు. వీఎస్టీ నుంచి ఆర్టీసీక్రాస్ రోడ్ మీదుగా ఇందిరాపార్క్ వరకు భారీ ర్యాలీ తీశారు. అనంతరం ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. "కార్మికుల చెమట కష్టంతో ఈ దేశం నడుస్తోంది. కార్మికుల పరిపూర్ణమైన హక్కులను ప్రధాని మోదీ అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారు. దేశవ్యాప్తంగా సెంట్రల్ ట్రేడ్ యూనియన్ పిలుపుమేరకు కార్మికులు ధర్నా చేస్తున్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం పెట్టుబడి వ్యవస్థకు దారులు తెరిచింది. మోదీ, అమిత్ షాలను కేంద్రంలో రాహుల్ గాంధీ ధైర్యంగా ఎదుర్కొంటున్నారు. పేదల హక్కులను కాలరాయడమే కాకుండా.. నరేగా ఉపాధి హామీకి పథకానికి మహాత్మాగాంధీ పేరు తొలగించారు. కేంద్రం తీసుకువచ్చిన ఆ చట్టాలపై అసెంబ్లీలో చర్చిస్తాం. నాలుగు కోడ్‌ల రద్దు విషయంలో కాంగ్రెస్ పార్టీ కార్మికులకు సంపూర్ణ మద్దతు ఇస్తుంది. కాంగ్రెస్ పార్టీ కార్మికుల పక్షపాతి. ప్రధాని మోదీ దిగొచ్చి కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి. అప్పటి వరకు ఈ ఉద్యమం కొనసాగాలి" అని మహేశ్ గౌడ్ అన్నారు.

# సింగరేణిలో కార్మిక సమ్మె ప్రభావం

దేశవ్యాప్త సమ్మెలోభాగంగా సింగరేణి రామగుండం ఏరియాలోని ఆర్జీ-3, అర్జీ-2, ఏపీఏ ప్రాంతాల్లో పర్మనెంట్, కాంట్రాక్ట్ కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నారు. కార్మికుల ఐక్య సమ్మెతో పనులు నిలిచిపోయాయి. కేంద్ర ప్రభుత్వం 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ కార్మిక వర్గం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో బీఎంఎస్ మినహా అన్ని కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. భూగర్భ, ఓపెన్ కాస్ట్ గనులలో కార్మికులు స్వచ్ఛందంగా విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు.గోదావరిఖని 2వ బొగ్గు గని ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు నిరసన చేపట్టారు. నాలుగు లేబర్ కోడ్ ల వల్ల కార్మికుల హక్కులను హరించి వేస్తుందని నాయకులు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని లేదంటే భవిష్యత్తులో కార్మికులకు మనుగడ ఉండదన్నారు.

# సమన్వయంతో అధికారులు మహాశివరాత్రి జాతరను సక్సెస్ చేయాలి

» పకడ్బందీగా తుది ఏర్పాట్లు పూర్తి చేయాలి
» మహా శివరాత్రి జాతర కమిటీ చైర్ పర్సన్ గరిమ అగ్రవాల్
» వివిధ శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్



**కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల, వేములవాడ**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి సన్నిధితో పాటు శ్రీ భీమేశ్వరాలయంలో ఈనెల 14 నుండి 16 వరకు జరిగే మహా శివరాత్రి జాతరను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించి, విజయవంతం చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్, మహా శివరాత్రి జాతర కమిటీ చైర్ పర్సన్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గురువారం వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుండి ఇంచార్జి కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమేశ్వర ఆలయంలో మహా శివరాత్రి జాతర సందర్భంగా భక్తులు స్వామి వారి దర్శనాన్ని సౌకర్యంగా చేసుకునేలా తుది దశ ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలని ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్ లు సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. జడ్పీ డిప్యూటీ సీఈఓ, వేములవాడ మున్సిపల్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి సంయుక్తంగా ఆలయ పరిసరాలు, పార్కింగ్ స్థలాలు, క్యూ లైన్లు ఇతర చోట్ల మూడు షిఫ్టులో సిబ్బంది ఉండేలా చూడాలని ఆదేశించారు. జాతరకు ముందు నుండి తరువాత మూడు రోజుల వరకు పారిశుధ్య సేవలు అందించాలని సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆద్వర్యంలో బస్సు స్టాండ్, పార్కింగ్ స్థలాలు, ఇతర చోట్ల పూర్తి వివరాలతో హెల్ప్ డెస్క్ లు సిబ్బంది అందుబాటులో పెట్టాలని, ప్రతి చోట అన్ని వివరాలతో కూడిన సైన్ బోర్డులు పెట్టించాలని తెలిపారు. ఆలయంలోని క్యూల వద్ద, పార్కింగ్ స్థలాల వద్ద, బస్సు స్టాండ్లలో తాగు నీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. సెస్ అధికారులు భీమేశ్వర ఆలయం, బద్ది పోచమ్మ ఆలయం, ఇతర చోట్ల 24 గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు కూడా చేసుకోవాలని, అధికారులు, సిబ్బంది ఉండాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖా ఆద్వర్యంలో భీమన్న ఆలయం, ప్రసాదం కౌంటర్, పార్కింగ్ స్థలాలు ఇతర చోట్ల వైద్యులు, సిబ్బంది, అంబులెన్స్ లతో సిద్దంగా ఉండాలని వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా, అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అగ్ని మాపక శాఖా అధికారులు ప్రధాన ఆలయాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు చెక్ చేయాలని, వారి సిబ్బంది గుడి ఆవరణలో జాతర సమయంలో సిద్దంగా ఉండాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు భక్తులకు అందించే ప్రసాదం, ఇతర ఆహార పదార్థాలను పరిశీలించాలని ఆదేశించారు. క్యూ లైన్లు, వీఐపీలు, కళ్యాణ కట్ట, ఇతర చోట్ల రద్దీ నియంత్రణ, దర్శనం పూర్తి చేసేందుకు జిల్లా స్థాయి అధికారులను నియమించామని, వారు ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించాలని తెలిపారు. కోడెల నిర్వహణ, సంరక్షణ జిల్లా పశు సంవర్ధక శాఖ, ఆలయ అధికారులు సమన్వయంతో చూసుకోవాలని ఆదేశించారు. జాతర ఆవరణలో ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకుండా చూడాలని సూచించారు. వృద్ధులు,దివ్యాంగులకు సహాయం కోసం వీల్ చైర్లు వాలంటీరను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతర విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి కావాల్సిన గదులు, ఆహారం, ఇతర సదుపాయాలు వేములవాడ ఆర్డీఓ, ఆలయ అధికారులు చూసుకోవాలని సూచించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎక్కడా దర్శనం, వసతులలో ఇబ్బందులు రాకుండా చూడాలని స్పష్టం చేసారు. మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలని, వీఐపీ, వీవీఐపీల దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్ లో ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, ఆలయ ఈఓ రమాదేవి తదితరులు ఉన్నారు.

# ర్యాలీలు,సభలు, సమావేశాలకు అనుమతి లేదు..

**- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**
**- కౌంటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన**



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 12:**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్‌లో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలు, మంచిర్యాల జోన్‌లోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, క్యాతన్‌పల్లి, బెల్లంపల్లి, చెన్నూర్, లక్షెట్టిపేట మున్సిపాలిటీలలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పారదర్శకంగా ఫలితాలు ప్రకటించేందుకు కఠినమైన మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఈ సందర్భంగా గోదావరిఖని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను పోలీస్ కమిషనర్ సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఓట్ల లెక్కింపు భద్రతలో భాగంగా కౌంటింగ్ కేంద్రాల లోపలి భాగం, బయటి ప్రాంగణం, వెలుపలి ప్రధాన రహదారుల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో మరియు వెలుపలి రహదారుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, అనధికార వాహనాలు మరియు వ్యక్తులకు అనుమతి లేకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు గుంపులుగా చేరకుండా ఉండాలని సూచించారు. ప్రజలు, రాజకీయ ప్రతినిధులు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డును భద్రతా సిబ్బందికి చూపించిన వారికే కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశం ఉంటుందని తెలిపారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, లైటర్లు వంటి నిషేధిత వస్తువులను కౌంటింగ్ హాల్లులోకి తీసుకెళ్లేందుకు అనుమతి లేదన్నారు. ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి లేదని, బాణాసంచా, డీజేలను పూర్తిగా నిషేధించినట్లు స్పష్టం చేశారు. అధికారులు, పోలీసులు, ఏజెంట్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# మహా శివరాత్రికి పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు

**- జాతర విజయానికి అందరూ సమన్వయంతో పని చేయాలి**
**- ట్రాఫిక్ నియంత్రణ,పార్కింగ్ ప్రదేశాలపై ప్రత్యేక దృష్టి**
**- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**





**కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల, వేములవాడ**
వేములవాడ శ్రీ భీమేశ్వరాలయంలో జరిగే మహాశివరాత్రి జాతర సందర్భంగా పోలీస్ శాఖ తరపున పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. గురువారం మహాశివరాత్రి జాతర భద్రతా ఏర్పాట్లపై జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో ఎస్పీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భీమేశ్వర ఆలయంలో మహా శివరాత్రి జాతర సందర్భంగా స్వామి వారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చే భక్తులకు స్వామి వారి దర్శనం సులభంగా, ప్రశాంతంగా జరిగేలా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈనెల 14 నుండి 16 వరకు జరుగు మహా శివరాత్రి జాతరను విజయవంతం చేయడానికి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికలతో చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భీమేశ్వర ఆలయంతో పాటు, బద్ది పోచమ్మ ఆలయం, నాంపెల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, అగ్రహారం ఆలయల వద్ద భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని సూచించారు. జాతరకు భారీగా తరలివచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ,పార్కింగ్ ఏర్పాట్లు,క్యూలైన్ల నిర్వహణ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, డ్రోన్ నిఘా వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహిళల భద్రత కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడంతో పాటు, తప్పిపోయిన వారికోసం సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతర ప్రాంగణంలో అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై నిఘా పెంచాలని, ప్రజలకు సూచనలు చేస్తూ లౌడ్‌స్పీకర్ల ద్వారా అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర పరిస్థితుల కోసం ఫైర్, మెడికల్, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. జాతర బందోబస్తు విధుల నిమిత్తం ఇతర ప్రాంతాల నుండి వచ్చే పోలీస్ అధికారులు,సిబ్బందికి తగిన వసతి సౌకర్యాలు కల్పించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విధులు నిర్వర్తించే సిబ్బందికి విశ్రాంతి తీసుకునేందుకు అనుకూలమైన వసతి గృహాలు, తాగునీరు, పారిశుధ్య సౌకర్యాలు,భోజన ఏర్పాట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతర సమయంలో పోలీస్ అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేసి భక్తులకు సురక్షిత, సౌకర్యవంతమైన వాతావరణంలో దర్శనం కల్పించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సమావేశంలో వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ నాగేంద్రచారి, ఇన్స్పెక్టర్ లు వీరప్రసాద్, కృష్ణ,మొగిలి, శ్రీనివాస్, శ్రీనివాస్,వెంకటేశ్వర్లు, మధుకర్, రవి, నాగేశ్వరరావు, ఆర్ఐ లు మధుకర్, యాదగిరి, రమేష్, ఎస్ఐలు,ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

## 15న సంత్ సేవాలాల్ జయంతి
# బంజారా భవన్‌లో కార్యక్రమాలు

ఈ నెల 15 వ తేదీ ఉదయం 11.00 గంటలకు హైదరాబాద్లో ఉన్న బంజారాహిల్స్ లోని సేవాలాల్ బంజారా భవన్లో లంబాడీ గిరిజనుల సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి ఘనంగాజరుగనుంది. ఈ జయంతి ఉత్సవాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, రాష్ట్రానికి చెందిన అందరు గిరిజన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక కార్పొరేటర్ తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని గిరిజన సంక్షేమ శాఖామాత్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా లంబాడీ గిరిజన సాంప్రదాయ పద్ధతి ప్రకారం సంత్ సేవాలాల్ ఆరాధన కార్యక్రమాలు, గిరిజన సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గౌరవ మంత్రివర్యులు మాట్లాడుతూ 2024 నాటి సేవాలాల్ జయంతి కార్యక్రమంలో పాల్గొని గౌ. ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారు అప్పటి వరకు వేడుకలకు ఖర్చు పెడుతున్న రూ. కోటిని రూ. రెండు కోట్లుగా రెట్టింపు చేయడమే కాకుండా బంజారా ఉద్యోగులకు ఉత్సవాలు జరుపుకోవడానికి వీలుగా ఫిబ్రవరి 15 నాడు స్పెషల్ లీవ్ శాంక్షన్ చేశారని గుర్తు చేశారు. ఈ నెల 15 నుంచి 21 వరకు అన్ని జిల్లాలలోని అన్ని ఎమ్మెల్యే నియోజకవర్గాలలో జరుగనున్న సేవాలాల్ జయంతి ఉత్సవాల నిర్వహణకై రాష్ట్ర ప్రభుత్వం రూ. రెండు కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజలు, ప్రజా ప్రతినిధులు, మీడియా మిత్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుతూ అందరికీ ఆహ్వానం పలికారు.

# జాతర ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్





**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి సన్నిధిలో జరిగే మహా శివరాత్రి జాతర ఏర్పాట్లను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం పరిశీలించారు. పార్కింగ్ ఏరియా, క్యూలైన్లు, పారిశుధ్య పనుల ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు సులభంగా దర్శనం అయ్యే విధంగా ఏర్పాట్లు ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో డీఆర్డీఓ గీత, ఆర్ అండ్ బీ ఈఈ నరసింహాచారి, డీఈ శాంతయ్య, ఆలయ ఈఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది పురస్కారాలు 2026 దరఖాస్తుల ఆహ్వానం



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 12:**
ఉగాది పర్వదినం పురస్కరించుకొని వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ,(వి.ఎస్.ఎస్.ఎస్) ఆధ్వర్యంలో అందించే ఉగాది పురస్కారాల కోసం ఉభయ తెలుగు రాష్ట్రాలలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, సామాజిక సేవకులు, కవులు, కళాకారులు, పురహితులు, విద్య, వైద్య రంగం, సాహిత్యం, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, శిల్పం, జానపదం, మిమిక్రి, ఇంద్రజాలం, హరికథ, బుర్రకథ, కోలాటం మొదలైన అంశాలతో పాటూ తదితర సేవా రంగాలకు కూడా వారికి ఈ పురస్కారాలు ఇవ్వడం జరుగుతుందని వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్ తెలిపారు. ఆసక్తి గలవారు పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8977748838 నంబర్ ను సంప్రదించాలని డాక్టర్ సురభి శ్రీధర్ తెలిపారు.

# ప్రజాస్వామ్య పట్ల అచంచల విశ్వాసం -- లండన్ నుంచి చిన్నారితో వచ్చి ఓటేసిన మాధురి





**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట పిబ్రవరి 12**
జమ్మికుంట మున్సిపల్ ఎన్నికలు ప్రజాస్వామ్య పండుగగా కొనసాగుతున్న వేళ, ఓటు హక్కు విలువను చాటి చెప్పే అరుదైన సంఘటన అందరి దృష్టిని ఆకర్షించింది. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన కొక్కుల కేదారేశ్వర్--శ్రీలత దంపతుల కుమార్తె మాధురి, ప్రస్తుతం లండన్‌లో నివసిస్తున్నప్పటికీ, తన ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం ప్రత్యేకంగా విదేశం నుంచి స్వగ్రామానికి చేరుకున్నారు. చిన్నారి కూతురిని వెంటబెట్టుకుని వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి పోలింగ్ కేంద్రానికి హాజరై ఓటు వేయడం ద్వారా ప్రజాస్వామ్యంపై తన అచంచల నమ్మకాన్ని చాటిచెప్పారు.“ఓటు మన హక్కు మాత్రమే కాదు, మన భవిష్యత్తును నిర్ణయించే బాధ్యత కూడా” అని ఆమె పేర్కొన్నట్టు సమాచారం. విదేశాల్లో ఉన్నప్పటికీ స్వగ్రామ అభివృద్ధి పట్ల ఆసక్తి చూపిస్తూ ఓటు వేయడం యువతకు ఆదర్శంగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.
ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎండీ. ఆయాజ్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి మాధురిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని, ఇలాంటి చైతన్యం సమాజానికి స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. మాధురిని సన్మానించి ఆమె కర్తవ్యనిబద్ధతను కొనియాడారు. ఆమె చిన్నారితో కలిసి ఓటు వేయడం చూస్తే ప్రజాస్వామ్య భావన తరతరాలకు ఎలా సంక్రమిస్తుందో స్పష్టమవుతుందని కమిషనర్ వ్యాఖ్యానించారు.

# భీమేశ్వర స్వామిని దర్శించుకున్న విశ్రాంత ఉద్యోగులు



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి వారిని భువనగిరి జిల్లా బీబీనగర్ మండలానికి చెందిన సుమారు 30 మంది విశ్రాంత ఉద్యోగులు గురువారం సతీ సమేతంగా దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని, ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎన్. ఆంజనేయులు, కార్యదర్శి టి. సత్తిరెడ్డి విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

## విషాదంలోనూ విధి నిర్వర్తన -- తల్లి మృతితో ఉన్న కుటుంబం ఓటేసి ఆదర్శంగా నిల్చారు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఫిబ్రవరి 12....**





జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన రజిబి (80) మృతి చెందడంతో విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులు కూడా తమ ప్రజాస్వామ్య బాధ్యతను విస్మరించలేదు. తల్లి అంత్యక్రియలు ఇంకా పూర్తికాకముందే పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు హక్కు వినియోగించిన మృతురాలి కుమారుడు ఇస్మాయిల్, కోడలు షబానా, మనవరాలు సన ప్రజాస్వామ్య పట్ల తమ కట్టుబాటును చాటిచెప్పారు.

విషాదాన్ని మనసులో ఉంచుకుని కూడా ప్రజాస్వామ్య పండుగలో పాల్గొనడం వారి బాధ్యతాభావానికి నిదర్శనంగా నిలిచింది. ఈ విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ ఎండీ. ఆయాజ్ కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా కలుసుకుని అభినందించారు. తల్లి మృతితో కలిగిన బాధను పంచుకుంటూ వారికి సానుభూతి తెలిపారు.

“ప్రజాస్వామ్యం బలపడాలంటే ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం. కష్టసుఖాల మధ్యలోనూ ఓటు హక్కును వినియోగించడం గొప్ప విషయం” అని కమిషనర్ పేర్కొన్నారు. వారి త్యాగస్ఫూర్తి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల్లో చోటుచేసుకున్న ఈ రెండు సంఘటనలు ప్రజాస్వామ్యానికి ఉన్న గొప్పతనాన్ని మరోసారి చాటిచెప్పాయి. విదేశాల నుంచి వచ్చి ఓటేసిన యువతి, విషాదంలోనూ విధి నిర్వర్తించిన కుటుంబం --- ఈ ఇద్దరూ సమాజానికి ఒక స్పష్టమైన సందేశం ఇచ్చారు:

ఓటు అంటే కేవలం ఒక గుర్తు కాదు... అది మన హక్కు, మన బాధ్యత, మన భవిష్యత్తు.

## క్రీడలతో శారీరక దృఢత్వం.. మానసిక ఉల్లాసం



**- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 16 నుండి 19 వరకు జూనియర్ కాలేజీ మైదానంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి మెన్, ఉమెన్ వాలీబాల్ క్రీడలను విజయవంతం చేయాలని ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో క్రీడలకు పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు.. సీఎం కప్ పేరిట క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు చేన్నమనేని శ్రీ కుమార్, ఉపాధ్యక్షులు కోళ్ల శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శి అజ్మీర రాందాస్, ఈసీ నెంబర్ మైలారం తిరుపతి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సంద్రగిరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు..

## జర్నలిస్టు అక్రెడిటేషన్ కార్డులు 44,706

**- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్.**



**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్**

రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రెడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల సీఎం రేవంత్రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందన్నారు. అక్రెడిటేషన్ కార్డుల జారీ విధానం, కమిటీ ఏర్పాటు. తదితర అంశాలపై ఇవాళ సచివాలయంలోని తన కార్యాలయంలో ఐఅండ్ పీఆర్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, సీపీఆర్వో మల్సూర్తో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అక్రెడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జీవో 252 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావే శమై వారి సూచనలు, అభిప్రాయాలను సవివరంగా పరిగణనలోకి సవరణలు చేసి జీవో 103ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సవరణల ద్వారా రాష్ట్రవ్యా ప్తంగా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రెడిటేషన్ కారులు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రెడిటే షన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని మంత్రి వివరించారు. అక్రెడిటేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో సంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభు త్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు.

# లేబర్ కోడ్స్ కార్మికుల మెడకు ఉరితాళ్లు వెంటనే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట పిబ్రవరి 12**



దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఇల్లందకుంట మండల కేంద్రంలో సిఐటియు, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ, ధర్నా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని ప్రయత్నిస్తున్న నాలుగు లేబర్ కోడ్స్కు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆందోళన వ్యక్తం చేశారు. చేతుల్లో ఎర్ర జెండాలతో, నినాదాలతో మండల కేంద్రం మార్మోగిపోయింది.

మండలంలోని వివిధ గ్రామాల నుంచి కార్మికులు, రైతులు ట్రాక్టర్లు, బైకులతో చేరుకొని ర్యాలీలో పాల్గొన్నారు. “కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దు చేయాలి”, “కార్మిక హక్కులపై దాడి ఆపాలి”, “పెట్టుబడిదారులకు కాదు, కార్మికులకు న్యాయం చేయాలి” అంటూ నినాదాలు చేశారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము మాట్లాడుతూ, ప్రస్తుతం అమలులోకి తీసుకురావాలని చూస్తున్న నాలుగు లేబర్ కోడ్స్---వేతన కోడ్, పరిశ్రమల సంబంధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తి భద్రత మరియు ఆరోగ్య కోడ్---మొత్తం 44 కార్మిక చట్టాలను ఒకే చట్రంలోకి తీసుకువచ్చి కార్మికుల హక్కులను కుదించే ప్రయత్నమని విమర్శించారు. కార్మికోద్యమం బలహీనపడేలా యూనియన్ హక్కులపై ఆంక్షలు విధించడం ఈ కోడ్స్ లక్ష్యమని అన్నారు. 1926 ట్రేడ్ యూనియన్ చట్టంలో ఉన్న అనేక హక్కులను ఈ కోడ్స్ ద్వారా పరిమితం చేస్తున్నారని, ముఖ్యంగా యూనియన్ల రిజిస్ట్రేషన్ విషయంలో కఠిన నిబంధనలు పెట్టి కార్మికుల సంఘటిత పోరాటాన్ని అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు. సెక్షన్ 6(2), 6(4) వంటి నిబంధనల ద్వారా యూనియన్ నమోదు ప్రక్రియను క్లిష్టతరం చేసి, పెద్ద ఎత్తున కార్మికులను సంఘటితం కాకుండా నిరోధించే విధానం అనుసరిస్తున్నారని విమర్శించారు.

అలాగే పరిశ్రమల సంబంధాల కోడ్ ప్రకారం 300 మంది వరకు కార్మికులు పనిచేసే సంస్థల్లో యాజమాన్యం ముందస్తు ప్రభుత్వ అనుమతి లేకుండానే ఉద్యోగాల తొలగింపులు, లేఆఫ్లు చేయగలగడం కార్మికులకు తీవ్ర అన్యాయం అని అన్నారు. ఇది ఉద్యోగ భద్రతను పూర్తిగా దెబ్బతీస్తుందని, నిరుద్యోగం మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

పనిగంటలను పెంచడం, ఓవర్టైమ్ నియమాలను మార్చడం, కాంట్రాక్ట్ వ్యవస్థను ప్రోత్సహించడం వంటి అంశాలు కార్మికులను అస్థిర పరిస్థితుల్లోకి నెట్టేస్తాయని పేర్కొన్నారు. సామాజిక భద్రత కోడ్లోనూ అసంఘటిత రంగ కార్మికులకు స్పష్టమైన హామీలు లేకపోవడం వల్ల వారికి ప్రయోజనం కలగదని అభిప్రాయపడ్డారు.

భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, చిన్న పరిశ్రమలలో పనిచేసే కార్మికులు ఈ చట్టాల వల్ల మరింత దెబ్బతింటారని, కనీస వేతనం, పింఛన్, బీమా, వైద్య సదుపాయాల వంటి అంశాలు ప్రశ్నార్థకంగా మారతాయని అన్నారు. కార్మిక వర్గాన్ని పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుకూలంగా మార్చే ప్రయత్నమే ఈ కోడ్స్ ఉద్దేశమని విమర్శించారు.

కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ నాలుగు లేబర్ కోడ్స్ను పూర్తిగా రద్దు చేసి, కార్మిక సంఘాలతో సంప్రదింపులు జరిపి ప్రజాస్వామ్య పద్ధతిలో చట్టాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు రేణిగుంట్ల సారయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి శ్రీకాంత్, సంతోష్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కన్వీనర్ జముఖం వెంకన్న, కో-కన్వీనర్ రావుల ఎల్లయ్య, గ్రామపంచాయతీ యూనియన్ గాదసిరి సంపత్, తోడం శ్రీనివాస్, సారయ్య, చంద్రయ్య, సత్తి, మధుకర్, రమేష్, సమ్మయ్య, రాజయ్య, వీరస్వామి, సాంబయ్య, శ్రీనివాస్, ఆనందం, కుమార్, శ్యామ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు, రైతులు ఐక్యంగా పోరాడితేనే హక్కులు కాపాడుకోవచ్చని నేతలు స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలకు ఐక్యత తెలుపుతూ భవిష్యత్తులో మరింత విస్తృత ఆందోళనలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

## నర్సాపూర్ నియోజకవర్గంలోని పలు గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఫిబ్రవరి 12**







మెదక్ జిల్లానర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామం:కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దపులి సతీష్ కుమారుడి బారసాల కార్యక్రమానికి హాజరై శిశువుకు ఆశీర్వాదాలు అందించారు. కుటుంబ సభ్యులకు శు భాకాంక్షలు తెలుపుతూ ఆనందంలోభాగస్వాములయ్యారు, అలాగే సతీష్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హత్నూర మండలం బొరపట్ల గ్రామకాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మామిడిగారి మల్లా రెడ్డి దశదినకర్మ కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి దుఃఖంలోభాగస్వాములయ్యారు. మల్లా రెడ్డి సేవలు పార్టీకి, గ్రామ అభివృద్ధికి ఎప్పటికీ స్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కే రామగుండం మేయర్ పీఠం

**- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**

**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్(రామగుండం), ఫిబ్రవరి 12:**




రామగుండం మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలందరూ బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ కి మద్దతుగా నిలిచారని మెజార్టీ స్థానాలను బీఆర్ఎస్ పార్టీ సాధించి మూడవ సారి రామగుండం మేయర్ పీఠంపై గులాబీ జెండా ఎగరవేస్తామని రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. గురువారం ఎన్టీపీసీ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రామగుండంలో గుండా పాలన పోలీస్ పాలన సాగుతుందని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేశారన్నారు. రామగుండం నియోజకవర్గంలో గత రెండు సంవత్సరాల జరుగుతున్న కాంగ్రెస్ దుర్మార్గపు అరాచక పాలనకు ప్రజలు చరమ గీతం పాడుతారన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. బెదిరింపులతో ఎన్ని ఇబ్బందులు పెట్టినా నామినేషన్లు విత్ డ్రా చేయించిన రామగుండం కార్పొరేషన్ బీ.ఆర్.ఎస్. పార్టీ అభ్యర్థులు మొక్కవోని ధైర్యంతో ఎన్నికల్లో కోట్లాడారన్నారు. ప్రజలందరూ బీఆర్ఎస్ పార్టీ పక్షాన నిలిచారన్నారు. తొలి సీఎం కేసీఆర్ పరిపాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకం అందించడం జరిగిందన్నారు. సంక్షేమ సారథి కెసిఆర్ పాలన ప్రజలందరూ కోరుతున్నారన్నారు. రాబోవు కాలంలో తిరిగి కెసిఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని చెప్పారు. రామగుండం కార్పోరేషన్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసిన ప్రజలందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విలేఖరుల సమావేశంలో నాయకులు మూల విజయ రెడ్డి, మిర్యాల రాజి రెడ్డి, గోపు అయులయ్య యాదవ్, నడిపల్లి అభిషేక్ రావు తోపాటు బీ.ఆర్.ఎస్. పార్టీ అభ్యర్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ నియమ నిబంధనలు

**- నర్సాపూర్ ఎస్సై రంజిత్ రెడ్డి**

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఫిబ్రవరి 12**





మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కార్యక్రమం నేడు బి.వి.ఆర్.ఐ.టి కళాశాల నిర్వహించబడును. ఈ సందర్భంగా ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లు మరియు నర్సాపూర్ పట్టణ ప్రజలకు క్రింది సూచనలు తెలియజేయడమైనది:పార్కింగ్ సంబంధించి:కౌంటింగ్ కేంద్రానికి వచ్చే వారందరూ తమ వాహనాలను వైపర్ కాలేజ్ దగ్గర ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశంలో మాత్రమే పార్క్ చేయాలి. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్క్ చేసినట్లయితే, అట్టి వాహనాలపై కేసులు నమోదు చేయబడును. ట్రాఫిక్కు ఆటంకం కలిగించే విధంగా ఎటువంటి వాహనాలు నిలిపివేయరాదు. 200 మీటర్ల నిషేధిత పరిధి:కౌంటింగ్ సెంటర్కు 200 మీటర్ల పరిధిలోకి కేవలం అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు మరియు కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. ఇతర వ్యక్తులకు ప్రవేశం ఉండదు. 200 మీటర్ల పరిధిలోకి ఎటువంటి సెల్ ఫోన్లు అనుమతించబడవు. సంబంధిత వ్యక్తులు తమ సెల్ ఫోన్లను ఇంటి వద్ద లేదా 200 మీటర్ల బయట విశ్వసనీయ వ్యక్తుల వద్ద ఉంచి లోపలికి రావాలి. ఎన్నికల కోడ్ అమలు:మున్సిపల్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నది. కౌంటింగ్ అనంతరం గెలిచిన అభ్యర్థులు ఎటువంటి ర్యాలీలు, రోడ్డు షోలు, బాణాసంచా కాల్చడం, డీజేలు ఏర్పాటు చేయడం, గుంపులు గుమికూడడం వంటి కార్యక్రమాలు నిర్వహించరాదు. మైక్లు, లౌడ్ స్పీకర్లు, వాహన ర్యాలీలకు అనుమతి లేదు. చట్టం మరియు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలు తీసుకున్న వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోబడును. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం, ప్రేరేపించే పోస్టులు, గెలుపు-ఓటమి పై ద్వేషపూరిత వ్యాఖ్యలు చేయరాదు. ఉల్లంఘించినట్లయితే చట్టరీత్యా కేసులు నమోదు చేయబడును. గుంపులుగా చేరడం, నినాదాలు చేయడం, ట్రాఫిక్కు అంతరాయం కలిగించడం నిషేధం. అందరూ పోలీసు శాఖకు సహకరించి కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా మరియు సజావుగా నిర్వహించేందుకు సహాయపడగలరని నర్సాపూర్ఎస్సై రంజిత్ రెడ్డి తెలియజేశారు